## క్లుప్తంగా

### 54 మందికి కంటి పరీక్షలు



పనసలపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాకినాడ అంజు కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 54 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 10 మందికి కాకినాడ అంజు ఆస్పత్రికి ఆపరేషన్లకు తరలించారు. మిగతావారికి కళ్లద్దాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆస్పత్రి మేనేజర్ శ్రీస్వామి వందనం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెల్పూరి సూర్యనారాయణ తెలిపారు. వైద్యాధికారులు తేజ, షర్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

### స్పీడ్ స్టాపర్ల ఏర్పాటు



పెద్దగడ్డ మలుపు వద్ద స్పీడ్ స్టాపర్లను ఏర్పాటు చేసిన పోలీసులు

చింతపల్లిరూరల్: రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ చెప్పారు. మండలంలోని ఘాట్‌రోడ్ల మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా స్పీడ్ స్టాపర్లు (వేగ నియంత్రణ) డ్రమ్ములు ఏర్పాటు చేశామన్నారు. వాహనచోదకులు అతి వేగంగా ప్రయాణించొద్దని సూచించారు. వాహనచోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోంటటామని హెచ్చరించారు.

### నేడు గ్రామాల్లో ఎమ్మెల్యేల పర్యటన

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సోమవారం మండలంలో పలు ప్రాంతాల్లో పర్యటించనున్నట్టు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జల్లి బాబులు తెలిపారు. డౌనూరు డౌనూరు సచివాలయం పరిధిలో మూలపేట రీసర్వే భూములకు పట్టాలు ఇస్తారన్నారు. చిట్టింపాడులో సచివాలయ భవనం, నడింపాలెంలో రైతు భరోసా కేంద్రంతో పాటు శరభన్నపాలెం, వెలగలపాలెంలో సచివాలయ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం వెలగలపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నేతలు, కార్యకర్తలు, సంస్థల డైరెక్టర్లు పాల్గొవాలని ఆయన కోరారు.

దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు)లు సోమవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 2.30 నిమిషాలకు ఇందుకూరుపేటలో పర్యటిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి పలు సేవా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో చినరమణయ్యపేట గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 3:30 నిమిషాలకు తున్నూరు పంచాయతీలో గొందూరు, కచ్చులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

### ఘనంగా మండల ఆరాధన



సదానంద స్వామీజీకి పూజాధికాలు నిర్వహిస్తున్న తణుకు వెంకటరామయ్య

అడ్డతీగల: పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య గురుదేవులైన సదానంద సరస్వతి స్వామీజీ 16వ మండలారాధన కార్యక్రమాన్ని ఆదివారం పవనగిరి క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు.స్వామీజీ విగ్రహం వద్ద పూజాధికాలు జరిపారు.101 దీపాలతో సదానంద స్వామీజీని ఆరాధించారు.పూజాధికాలు అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పులిహోర, ఫలాలు, దుస్తులు అందజేశారు.

# ప్రయాణం.. జర భద్రం

- ఘాట్‌రోడ్డు ప్రయాణంలో అంతరాయం



ఘాట్ రోడ్డులో బోల్తాపడిన లారీ (ఫైల్)




ఘాట్‌రోడ్డులో భారీ వాహనాలు నిషేధిస్తూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



రోడ్డులో ట్రాఫిక్ జామ్ (ఫైల్)

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని అంతరాష్ట్ర రహదారి అయిన మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డు ప్రయాణం భయం భయంగా మారింది. ఇరుకైన రహదారి కావడంతో తరచూ వాహనాలు నిలిచిపోయి గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో పాటు ఈ మార్గంలో తరుచు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఫలితంగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఘాట్‌రోడ్డులో భారీ వాహన ప్రమాదాలు నిత్యం సంభవిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఘాట్‌లో వాహనాల ప్రమాదాలు ఎక్కువైయ్యాయి. ఘాట్‌లో భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించినా డ్రైవర్లు పట్టించుకోకుండా భారీ వాహనాలతో తిరుగుతుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చత్తీస్‌గడ్ రాష్ట్రం మల్కన్‌గిరి నుంచి కాకినాడకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ వాలీ సుగ్రీవ్ మలుపు వద్ద బోల్తాపడింది. చేపల మేత లోడ్‌తో వెళ్తున్న మరోక లారీ అదే మలుపులో రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరువైపులా భారీగా మూడు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా మార్గం లేదు. ఈ మార్గంలో రాజమహేంద్రవరం నుంచి మారేడుమిల్లి మీదగా భద్రాచలం జిల్లాలోని విలీనం మండలాలతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గడ్, ఒడిశా, రాష్ట్రాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి.

**తప్పని ఇబ్బందులు**

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తరుచూ సంభవిస్తూనే ఉన్నాయి. అడవి మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోతే అంతే.. ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు రోడ్డు మీదే గంటలు తరబడి పడిగాపులు కాస్తూ నిరీక్షిస్తున్నారు. చంటి పిల్లలు, బాలింతలు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు చెక్కనక్కర్లేదు. ఇప్పటికైనా ఇరు రాష్ట్ర అధికారులు స్పందించి ఘాటీ రోడ్డు విస్తరణ చేయాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తూ మలుపుల్లో మరమ్మతులు , ప్రమాదాలకు గురవుతున్నాయి. మారేడుమిల్లి నుంచి చింతూరుకు 30 కిలోమీటర్లు మేర ఘాట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో పెద్ద,పెద్ద మలుపులున్నాయి. ఘాట్ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ మార్గంలో వాహనం అదుపుతప్పినా, గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. భారీ వాహనాల రాకపోకలు నిషేదిస్తూ రవాణా శాఖాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెబుతున్నారు.

## మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం

వై.రామవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల నేతల ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సభలో మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి కె.ఆదిరెడ్డి, పరిశీలకుడిగా జిల్లా కోశాధికారి కె కృష్ణ, ముఖ్య అతిథులుగా జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె.సూరిబాబు, రంపచోడవరం అధ్యక్షుడు సీహెచ్ సనాతనబాబు, అడ్డతీగల పూర్వ ప్రధాన కార్యదర్శి మధు పాల్గొన్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బి.నూకరాజు, అధ్యక్షుడిగా ఎస్ వెంకటరమణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్.రామదాసు, మహిళా అధ్యక్షరాలుగా ఎస్.గీతాంజలి, కోశాధికారిగా ఆర్.లక్ష్మణస్వామి, ప్రధానకార్యదర్శిగా పి.లక్ష్మణ రెడ్డి, కార్యదర్శులుగా పి.ప్రశన్న, పి.గంగాధర రెడ్డి, ఆర్.వి.ఆర్.కె .రెడ్డి, వి.ప్రభాకరరెడ్డి, ఆర్.చాందిని, పి.బుల్లబ్బాయిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా పి.లక్ష్మణరెడ్డి, ఎస్.వెంకటరమణ, ఆర్.దేవిరెడ్డి, కె.వీరభవాణి, మహిళా కమిటీ కన్వీనర్‌గా ఆర్.హరితకుమారి, సభ్యులుగా ఇందిరప్రియదర్శిని, బి.సుబ్బలక్ష్మి, కె.దుర్గాదేవి, బి.ఆశాలత, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా ఎం.దుర్గాప్రసాదు, సభ్యులుగా సీహెచ్.నాగమల్లేశ్వరి, కె.సాయిప్రియాంక, కె.శ్యాంసుందర్, ఎస్.సత్యవతి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌బాషా

గంగవరం : మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించినట్టు తహసీల్దార్ శ్రీమన్నారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 36 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తారని, మృతి చెందిన వారిని జాబితా నుంచి తొలగిస్తారని ఆయన పేర్కొన్నారు. ఆదివారం గంగవరం, లక్కొండ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌భాషా(జిలానీ) పరిశీలించారు. ఆయన వెంట గ్రామ రెవెన్యూ అధికారు అప్పలకొండ, రామలక్ష్మి, కార్యదర్శి వెంకటరమణ, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు ఉన్నారు.

## సతకంపట్టు కనకదుర్గకు వెండి శఠగోపం అందజేత

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయానికి ఆదివారం కర్రి అప్పారావు లలిత శివజ్యోతి దంపతులు సుమారు రూ.లక్ష విలువ చేసే వెండి శఠగోపాన్ని ఆలయ ప్రధాన అర్చకు లు బోగారపు వెంకటరమణకు అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి వెండి శఠగోపాన్ని అందించాలనుకున్నామని, కాస్త ఆలస్యం జరిగిందన్నారు. అనంతరం అప్పారావు దంపతులను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

## ఆత్మీయ వీడ్కోలు

హుకుంపేట: ఉప్ప పీహెచ్‌సీలో గడిచిన ఏడు సంవత్సరాలుగా వైద్య సేవలు అందించిన వైద్యాధికారులు డా.అనుషా, ప్రశాంత్‌లను సిబ్బంది వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉప్ప పీహెచ్‌సీ పరిధిలో మారుమూల గ్రామల్లో సైతం సిబ్బందితో కాలినడకన వెళ్లి వైద్య సేవలందించిన వైద్యాధికారి అనూషా సేవలు మరువలేనివన్నారు. ఉన్నత విద్య పూర్తయిన అనంతరం మరలా తమ పీహెచ్‌సీకి రావాలని కోరారు. విధుల్లో అంకితభావం, సేవా గుణం గుర్తింపుతో ఆమె అనేక ఉత్తమ అవార్డులు అందుకున్నారన్నారు.

## నేడు పార్టీ నేతల సమావేశం

వై.రామవరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అన్న కార్యక్రమంపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులైన ఎంపీపీ, జడ్పీటీసీ , వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు, కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ అధ్యక్షులు, వలంటీర్లు, తదితరులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

## మండల సమావేశం రేపు

గంగవరం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు , ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు , వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు.

## నేటి నుంచి పాడేరులో క్రైస్తవ మహాసభలు

హుకుంపేట/పాడేరు రూరల్ : జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 6,7,8 తేదీల్లో క్రైస్తవ మహాసభలు నిర్వహించనున్నట్టు అరకు, పాడేరు బైబిల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బి.చిన్నిబాబు, పి.అశ్విన్ తెలిపారు. హుకుంపేట మండలంలోని తీగలవలస పంచాయతీ గుర్రలతోట బైబిల్ రీసెర్చ్ సెంటర్‌లో దైవసేవకులు, బైబిల్ కళాశాల విద్యార్థులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడేరు జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే విశ్వం దేవుని విద్యాలయ అనే టైటిల్‌తో నిర్వహించే క్రైస్తవ మహసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అరుకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్.కరుణాకర్, దైవసేవకులు అర్జున్, మాగేశ్వరరావు పాల్గొన్నారు.

## తుప్పల తొలగింపు



తుప్పలను తొలగిస్తున్న పోలీసులు

జి.మాడుగుల: పాడేరు రోడ్డు మార్గంలో పోలీస్‌శాఖ అధ్వర్యంలో ఆదివారం రోడ్డుకిరువైపులా పచ్చిమొక్కలను తుప్పలను తొలగింపు కార్యక్రమం జరిగింది. జి.మాడుగుల–సంతబయలు ప్రమాదకర మలుపు వద్ద శివాలయం, ఈదులబయలు వద్ద అక్కడక్కడ పాడేరు రోడ్డు మార్గంలో పెరుకు పోయిన తుప్పలు, పిచ్చి మొక్కలను సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ శ్రీనివాస్‌లో పాటు పోలీస్ సిబ్బంది, యువకులు, వాహన డ్రైవర్లు తొలగించారు. వారు మాట్లాడుతూ సామర్థ్యానికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించి, అతి వేగంగా నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని వారు తెలిపారు. వాహనదారులు సురక్షిత ప్రయాణం చేయాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు దృష్టి సారించాలని వారు సూచించారు. తుప్పలు, పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టిన పోలీస్‌లకు పలువురు స్థానికులతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.

# స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన



ఉర్లాకులపాడులో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: మండలంలో ఓటరు నమోదుకు 175 మంది దరఖాస్తులు అందజేశారని తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి తెలిపారు. మండలవ్యాప్తంగా శని, ఆదివారాల్లో ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. మండలంలోని ఉర్లాకులపాడు, రాజవొమ్మంగి, అప్పలరాజుపేట, శరభవరం, అమ్మిరేఖల గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతు గతంలో మండలంలో 50 బూత్‌లు ఉండేవని, కొత్తకింద్ర, బడదనాంపల్లి పంచాయతీ చినరెల్లండిపాడు గ్రామాల్లో కొత్తగా రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మండలంలో బూత్‌ల సంఖ్య 52కు చేరిందన్నారు. మండలంలో మొత్తం 32,300 ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 31,800 మంది ఉన్నట్టు తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన ఓటరు స్పెషల్ డ్రైవ్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు.

# బాధితుడికి ఆర్థిక సాయం



చంద్రమోహన్‌కు సాయమందిస్తున్న దాతలు

చింతపల్లిరూరల్: మండలంలోని సాయినగర్ వీధికి చెందిన కిల్లో చంద్రమోహన్‌నాయుడు గత కొన్నేళ్లుగా నరాల బలహీనత కారణంగా అనారోగ్యం బారన పడి ఇంటికే పరిమితమయ్యారు. బాధిత పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు వారియర్స్ ట్రస్టు ముందుకొచ్చింది. ఈ మేరకు విషయం తెలుసుకొని, బాధిత కుటుంబానికి ప్రతి నెల రూ.1000లు అందించేందుకు నిర్ణయించినట్టు ట్రస్ట్ అధ్యక్షుడు దూనబోయిన రమణ తెలిపారు. రాజేష్,బిలాష్కుర్ తదితరలుఉ పాల్గోన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అభినందనీయం

చింతపల్లిరూరల్: పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేయడం ఆనందంగా ఉందని చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు దేశెట్టి సతీష్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పాత్రికేయ వృత్తిని నమ్ముకోని ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం ముందడుగులు వేసిందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరగడం ఆనందంగా ఉందన్నారు.

# ప్రకృతి సాగుపై అవగాహన



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరెడ్డి

రాజవొమ్మంగి: ఆకురాలే సమయం దాటి చిగుర్లు వేస్తున్న జీడిమామిడి తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది మహిళా రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ మేరకు మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ అమ్మిరేఖల యూనిట్ ప్రకృతి వ్యవసాయం ఎల్–2 లక్ష్మణరెడ్డి వీఓ మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. జీడిమామిడి తోటలను ఆశించే క్రిమికీటకాలు ప్రస్తుతం లార్వా దశలో ఉంటాయని, వీటిని సమూలంగా నాశనం చేసేందుకు నీమాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆవుమూత్రంతో తయారుచేసిన జీవామృతం తదితర ద్రావణాల ఉపయోగం తెలియజేశారు. 100 లీటర్ల నీమాస్త్రంలో మూడు లీటర్ల నామాస్త్రం కలిపి మొక్కల ఆకులు పూర్తిగా తడిసేలా పిచికారీ చేసుకోవాలని వివరించారు.

## ఆశాజనకంగా కంది పంట



పాపంపేటలో పూత దశలో కంది పంట

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో కంది పంట ఆశాజనకంగా ఉంది. కొవ్వూరు, పడాలపాలెం, వడ్డిప, పాపంపేట తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో 60 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. అడపాదడపా కురిసిన వర్షాలతోపాటు వాతావరణం అనుకూలంగా ఉండడంతో ప్రస్తుతం పూత దశలో ఉంది. పది రోజుల్లో గింజ కడుతుందని, ఈ ఏడాది పంట కలిసోస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటకు పెద్దగా పెట్టుబడితో పని లేదు. విత్తనాలు చల్లే ముందు దుక్కు మినహా తర్వాత ఏవిధమైన పెట్టుబడులు పెట్టనవసరం లేదు. పెట్టుబడులు పోను దిగుబడులు ఆధారంగా ఖర్చులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

# కుట్ర రాజకీయాలు తగవు



చింతూరులో బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కూనవరం/చింతూరు: బిజేపీ మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రలో భాగంగా కూనవరం, చింతూరు ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల చేపడుతున్న కుట్ర రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తీర్పు ఇస్తాయన్నారు. కూనవరం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. చింతూరులో డిగ్రీ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగు పరచాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు పరిహారాన్ని అందజేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్, వైస్ ఎంపీపీ పెంటయ్య, సుందర్, కృష్ణరాజు పాల్గొన్నారు.

# అంతర పంటలతో అదనపు ఆదాయం



మామిడిలో అంతర పంటగా బరబాటి

కె.కోటపాడు: అంతర పంటల సాగుపై గ్రామాల్లో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ పంట కాపు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ నెల వరకు ఉంటోంది.

ఆ తర్వాత మామిడి తోటల మధ్య ఖాళీ స్థలాల్లో కూరగాయల సాగు చేస్తున్నారు. ఇలా తక్కువ కాల వ్యవధిలో దిగుబడి వచ్చే అంతర పంటలతో అదనపు ఆదాయం పొందుతున్నామని రైతులు చెబుతున్నారు. పాతవలస, పిండ్రంగి, మర్రివలస, గొట్లాం, సూదివలస, బోట్టవానిపాలెం, కె.సంతపాలెం, తదితర గ్రామాల్లో బరబాటి, బెండ, వంగతోట, టమాటా పంటలను 40 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

## ఎంపీకి ఆహ్వానపత్రిక అందజేత



అరకు ఎంపీ మాధవికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

కొయ్యూరు:ఆనెత 14,15న పాడేరులో వీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న భగవాన్ బిర్సా ముండా 149వ జయంతి వేడుకలకు హాజరు కావాలని అరకు ఎంపీ మాధవిని ఆదివాసీ జేఏసీ ఆదివారం ఆహ్వానించింది.జేఏసీ నేతలు ఆదివారం ఎంపీ మాధవిని ఆమె కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ ఆదివాసీ సదస్సు,సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. ఘనంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం చేయాలని కోరారు.దీనిపై స్పందించిన ఎంపీ తమ వంతుగా ఆర్థికసాయమందిస్తామని తెలిపారు.

# మొక్కలతోనే కాలుష్య నివారణ



కశింకోట పీహెచ్‌సీ రోడ్డులో మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పనస, మర్రి, బాదం, కానుగ వంటి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవ రాశులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి మానవ మనుగడకు విఘాతం కలుగుతోందన్నారు. ఈ మేరకు చెట్లు పెంచాల్సిన ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంచేలా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, రిటైర్డు అటవీశాఖ అధికారి వినోద్ కుమార్, క్లబ్ సభ్యులు మళ్ల మురళి, సాంబ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి భూమిపూజ

రావికమతం: పి.పొన్నవోలు శివారు కుముందానిపేట గిరిజన కాలనీలో రామాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు సహాయ సహకారాలు అందించడంతో ఆలయ నిర్మాణానికి సంకల్పించారు.

## అ'పూర్వ' సమ్మేళనం



నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్ 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్లో 2007–08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల తొలి సమ్మేళనం విసన్నపేటలోని పడమటమ్మ లోవలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని, పరస్పరం పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. తమ విద్యార్థి మిత్రుల్లో ఎవరికి కష్టం వచ్చినా ఆదుకోవాలని, ప్రతి ఏడాది సమావేశం కావాలని తీర్మానించుకున్నారు. అనంతరం అంతా కలిసి ఫొటోలు దిగారు. ఈ ఆత్మీయ కలయికకు సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.